COMMUNIST PARTY OF INDIA (MARXIST)
Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం / ప్రసారార్థం

తేది: 04.11.2026

మహిళలపై ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల దాడి దారుణం
దోషులను కఠినంగా శిక్షించాలి

-సీపీఐ(ఎం) డిమాండ్

రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ ప్రాంతంలో ఒక క్రిస్టియన్ కుటుంబాన్ని కలిసి వస్తున్న ఇద్దరు దళిత (ఎస్సీ) మహిళలపై, మత మార్పిడులకు పాల్పడుతున్నారనే నెపంతో ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు అత్యంత దారుణంగా భౌతిక దాడులకు పాల్పడ్డారు. నిందితులను అరెస్టు చేసి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరుతూ వివిధ సంఘాలు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలియజేస్తుంటే, అక్కడికి కూడా ఆర్ఎస్ఎస్ వారు చేరుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ మతోన్మాద ఘటనలను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి, నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి తమ మతాన్ని విశ్వసించే, ప్రచారం చేసుకునే హక్కును కల్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ, ఆర్టికల్ 19 ప్రకారం ప్రచార స్వేచ్ఛ పౌరులకు ఉన్నాయి. రాజ్యాంగబద్ధంగా ఇటువంటి ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలు ఉన్నప్పటికీ, కనీసం మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడులకు పాల్పడటం రాజ్యాంగ హక్కులను బహిరంగంగా ఉల్లంఘించడమే. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి తప్ప, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని గూండాల్లా వ్యవహరించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధిత దళిత మహిళలకు పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి మతోన్మాద ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

(జాన్ వెస్లీ)
రాష్ట్ర కార్యదర్శి